“ప్రే ద్వార్ ఖడా ఏక్ జోగీ
న మాంగేయె సోనా చాందీ
మాంగే దర్శన్ దేవీ
తేరి ద్వార్ ఖడా ఏక్ జోగీ”

ఎడమచేతిని ఎడమచెవి కానించి కుడిచేతిని అలా అలా విశాల ప్రపంచంవైపు విసురుతూ, తలుపులు వేయబడిన బెడ్‌రూమ్ ముందు నుంచుని పాడుతున్నాడు కృష్ణ.

“వస్తున్నా బాబూ-వస్తున్నా” అంది రాధ గదిలోంచే.

“అయితే ఇంగ్లీషుపాట పాడుతాను...”

“వద్దు వద్దు... అంత పనీ చేసెయ్యకండి. ఇదుగో!” అంటూ తలుపులు తీసింది రాధ.

వెన్నెలలాంటి మొహం నక్షత్రాల్లాటి కళ్ళు మెరుపులాటి చిరునవ్వు వీణలాటి స్వరం పలకరించకుండా పలకరిస్తున్న మూర్తి-ఇదీ రాధంటె.

ఆరోజు రాధ చిన్నచిన్న పూలున్న ప్రింటెడ్ వాయిల్ చీర కట్టుకుని హైదరాబాద్ ఛోళీ వేసుకుంది. ‘కాటుకలో ఇంత అందం వుంది సుమా’ అంటున్నాయి ఆమె కళ్ళు.

కళ్ళార్పకుండా ఆమెను చూశాడు కృష్ణ- ఆమె పమిటకొంగును భయభక్తులతో ముట్టుకున్నాడు.

“అబ్బ... మరీ ఏవిటండీ. బొత్తిగా చిన్నపిల్లలయిపోతున్నారు. పక్కింటి పిన్నిగారు చూస్తే... అవ్వ్ వ ఇంకేవన్నా వుందా!”

“పక్కింటి పిన్నిగారు షైరింజన్నుక్రింద పడనీగాని ... చీర కట్టుకుంటానని లోపలికెళ్ళిందానివి బయటపడ్డానికి నలభై నిముషాలా!”

“సరైన చీర దొరికితేగా...”

“ఈవిధంగా నీవు ఆలస్యం చేస్తే అవతల టైము దాటిపోదూ?” పద ఇప్పటికే ఆరయింది. సరిగా ఆరున్నరకల్లా షో మొదలవుతుంది” అన్నాడు కృష్ణ.

“పోదాం పదండి.”

* * *

రతన్ బజారు దగ్గర కృష్ణ, ప్రాణమిత్రుడు సుబ్బుతో కలిసి ఆఫీసుకు వెళ్ళడానికై బస్సెక్కాడు. సెంట్రల్ దగ్గర బస్సాగింది.

రోజూ అక్కడ ఒక అమ్మాయి బస్సెక్కేది. అజంతా స్టాపులో దిగిపోయేది. ఆ అమ్మాయికి పన్నెండేళ్ళు వుంటాయేమో. రోజూ బడికి సరిగా ఆబస్సే ఎక్కేది.

ఆరోజు బస్ కదిలింతర్వాత ఆ అమ్మాయి పరుగెత్తుకొచ్చి ఎక్కింది. కొసని కూచునివున్న కృష్ణ వంగి ఆ అమ్మాయిని ఎడంచేతో పట్టుకుని బస్సులో ఎక్కించి, తనులేచి ఆసీటులో కూచోమన్నాడు. ఆ అమ్మాయి కొంత సిగ్గుపడుతూ చిరునవ్వుతో “అక్కర్లే వద్దండీ” అంది.

“ఫరవాలేదు. కూచో” అన్నాడు కృష్ణ. ఆ అమ్మాయి కూచుంది. ఆ అమ్మాయి పేరు రేఖ.

ఆరోజు తర్వాత రేఖ కృష్ణనూ, అతనితో సుబ్బునీ చూచినప్పుడెల్లా నవ్వేది. ఏవయినా కబుర్లు చెప్పేది. కృష్ణ, సుబ్బులిద్దరికీ రేఖ అంటే అదో విధమయిన అనురాగం ఏర్పడింది.

కృష్ణ, సుబ్బులిద్దరూ సరదాకి ఇంగ్లీషులో పోట్లాడుకున్నా, కండక్టర్‌తో కావాలని తగవులు పెట్టుకున్నా, రేఖ మందహాసం చేస్తూండేది. ఆ అమ్మాయి నవ్వితే హాయి అనిపించేది.

సుబ్బు రేఖని వాళ్ళ బడికబుర్లడిగేవాడు. మొహమంతా విరిసిన విరిసెనపూవులా చేసుకుని, మెరిసేకళ్ళతో ఉత్సాహంతో ఎన్నో విషయాలు చెప్పేది రేఖ. ఇద్దరు ‘పెద్ద’ వాళ్ళు తనమాటలు ఇంతశ్రద్ధతో వింటున్నారు కదా అన్న ఆశ్చర్యంతో రేఖకళ్ళలో క్రొత్తవెలుగొచ్చేది. ఆ అమాయకపు వయసులోని నైర్మల్యమూ, ఆశాభావమూ చూస్తుంటే కృష్ణ, సుబ్బులముందు గడచిపోయిన చిన్ననాటి రోజులువచ్చి నిలచేవి.

వారి స్నేహం అలా పెరిగింది.

ఒకరోజు రేఖ వాళ్ళనాన్నతో కలిసి బస్సెక్కింది. కృష్ణ, సుబ్బులను నాన్నకు చూపెట్టింది. ఆయనా ఎంతో సరదాగా కబుర్లు చెప్పారు.

రేఖ నాన్నగారు, తిరుపతిలో తెనుగు పండితుడయిన తన చిన్నాన్న వద్ద చదువుకున్నాడని హఠాత్తుగా కృష్ణ తెలుసుకున్నాడు. అప్పటినుండి కృష్ణ, రేఖనాన్న సన్నిహితులయ్యారు. సంక్రాంతి రోజున మిత్రులిద్దరూ తమ ఇంటికివచ్చి ‘టీ’ పుచ్చుకునేదాక పూరుకోలేదు రేఖనాన్నగారు.

ఆతర్వాత కృష్ణ, సుబ్బు ప్రతిశనివారమూ ఆఫీసు అయిపోగానే రేఖఇంటికి వెళ్ళేవారు. రేఖ నాన్నగారూ, రేఖా...సుబ్బూ కృష్ణా...నల్గురూ కూచుని కబుర్లు చెప్పుకునేవారు. ఒకరోజు రేఖావాళ్ళమ్మ, కృష్ణతో “ఏమండీ, మీఆవిడనీ పాపనీ మాయింటికి తీసుకురండీ...” అంది.

“అలాగే” నన్నాడు కృష్ణ.

* * *

కృష్ణా, రాధా, పాపాయీ, సుబ్బూ, ఒకరోజు సాయంకాలం రేఖావాళ్ళింటికెళ్ళారు.

రేఖా, వాళ్ళమ్మ ఎంతో సంతోషంతో స్వాగతం చెప్పారు. టిఫినూ కాఫీ ఇచ్చారు. రేఖ నాన్నగారు సుబ్బునీ, కృష్ణనీ డ్రాయింగ్ రూములో కూచోబెట్టారు. బాతాఖానీ వేశారు.

ఇంతలో రేఖవచ్చింది. కృష్ణ, సుబ్బుల కేసి చూస్తూ “ఏమండోయ్! నా గులాబి మొక్క ఎంత చక్కటిపూవు పూసిందో తెలుసా? రండి... చూద్దురుగాని.”

“వచ్చినవాళ్ళని అలా కూర్చోనీవమ్మా. వెళ్ళేప్పుడు చూస్తారులే...” అన్నారు రేఖ నాన్న.

“వెళ్ళేటప్పటికి చీకటయిపోతుంది. పూవు బాగా కనపడదు నాన్నా” అంది రేఖ ఎంతో ముచ్చటగా.

“సరే! పద, చూద్దాం” అన్నాడు సుబ్బు. రేఖ సుబ్బుచేయి పట్టుకు లాక్కెళ్ళింది. సరదాతో సుబ్బూ పరుగెత్తాడు.

వాళ్ళనిచూచి రేఖనాన్న “పదమూడేళ్ళొస్తూంది కాని ఇంకా చిన్నపిల్లకిమల్లే ప్రవర్తిస్తుంది.”

“ఆ... రేఖ చిన్నపిల్లే కదండీ” అన్నాడు కృష్ణ.

కాసేపైనతర్వాత రేఖ పరుగెత్తుకుంటూ వచ్చింది.

“నాన్నా నాన్నా... ఇదిగో చూడు. బాగుందా” అని తన పొడుగాటి జడముళ్ళోనున్న చిన్న గులాబిపూవుని చూపింది.

ఆంధ్ర సచిత్ర వారపత్రికలో
వరుసగా ప్రకటింపబడిన
శ్రీ క్రొవ్విడి లక్ష్మన్నగారి
“హనోయ్ విశేషాలు
కాంబోడియాకబుర్లు”
పుస్తక రూపములో వెలువడినది.
వెల రు. 1.13
విశాలాంధ్రప్రచురణాలయం, విజయవాడ-2.

★ సత్యభామలు ★

"బాపుందమ్మా...మరి పూవుని కోయ కన్నావుగా..."

"అన్నావు. కానీ...మరి...మరీ...మరే...ఈ సుబ్బుగారే 'ఇది నీవు పెట్టుకుంటే బాగుంటుం' దన్నారు నాన్నా" అంది. పెద్దలు ముగ్గురూ నవ్వారు. రేఖ మొహం గులాబిలా అయింది.

మరికొన్ని నిముషాలతర్వాత రేఖ నాన్నగారేదో తొందరపని వుందని క్షమించమని వెళ్ళిపోయారు.

రేఖ తన మిత్రులిద్దరినీ – తను చదువుకునే గదిలోకి తీసుకువెళ్ళింది. తన పుస్తకాలను, తను ఎంబ్రాయిడరీ చేసిన టేబిల్ క్లాతూ, తన చేతులతో చేసిన దూదిబొంగా, ఘోరఘోరంలో ఘనుగా పోసయివందుకు బడివారు బహూకరించిన చలవరాతి శివపార్వతీ శిల్పమూ, అన్నీ చూపించింది.

జింక్ షీట్ మీద పడుతున్న వానజల్లులా, పెద్దగాలిలో ఆడుతున్న చెట్టురెమ్మల్లా, ఉవ్వెత్తుగాపొంగి మరుక్షణం ఇసుకను ముద్దెట్టుకునే సంద్రపు కెరటాల్లా, ఎంతో ఉత్సాహంతో రేఖ, గబగబ మాట్లాడుతూ, వర్ణించుతూవుంటే, కృష్ణ, సుబ్బు కళ్ళూ చెవులూ అప్పగించారు. ప్రపంచమంతా పాలసముద్రమేననీ, జీవితమంతా పూలపన్నెలేననీ, తను అనుకున్నదల్లా అయితీరుతుందనీ, ఆశించే బంగారు బాల్యదశలోని కుతూహలం, ఉత్సాహం చూచి, ఒక్కక్షణం కృష్ణా, సుబ్బూ, రేఖతో సమానంగా తయారయారు. అలాగే వుండిపోవాలని వాంఛించారుకూడా.

సుబ్బు కుర్చీలో చేరగిలబడి టేబిల్ మీది పిల్లల మాసపత్రిక తీసి చూడసాగాడు. రేఖ కృష్ణకి తన వాటర్ పెయింటింగ్స్ బుక్ చూపెట్టసాగింది. పదో పన్నెండో చక్కటి చిత్రాలు గీచింది. వాటిని కృష్ణ మెచ్చుకుంటుంటే రేఖ ఎంతో సంతోషించింది. ఆ బుక్ ఆఖరున, వాళ్ళ నాన్నగారు, స్కూలుమేష్టారు, ఇంకా ఎవరెవరో పెద్ద వాళ్ళందరూ రాసిన అభిప్రాయాలను చూపెట్టింది.

కృష్ణ అన్నాడు. "నీవు చాల ఘటికురాలివే సుమా" రేఖ నవ్వింది.

కృష్ణ, పెయింటింగ్ బుక్ మూసేస్తూ "ఊ...ఇంకేమయినా వున్నాయా?" అని అడిగాడు.

"అలా మూసేయకండి. అందులో ఆఖరున మీ అభిప్రాయమూ రాయాలి."

"అబ్బే! ఎందుకులే?"

"రాయండీ!"

"మరోసారి రాస్తాలే."

"ఊహు ఇపుడే రాసేయండి" అని కృష్ణ చేయిపట్టుకు టేబిల్ దగ్గరకు లాక్కెళ్ళింది రేఖ. కృష్ణ కుర్చీలో కూచుని రాస్తుంటే అతని మొహందగ్గరగా తన మొహంవుంచి అతడేం రాస్తాడో అని చూస్తూంది.

అపుడే—

అంతవరకూ రేఖావాళ్ళమ్మతో మాట్లాడుతూవున్న రాధ, రేఖఅమ్మ వంటింట్లోకి వెళ్ళగానే, ఇల్లంతా తిరిగిచూస్తూ—

రేఖ చదువుకునేగదిలో అడుగుపెట్టింది. గభుక్కున తిరిగి వెళ్ళిపోబోయింది.

ఈ శబ్దంవిన్న రేఖ "రండి...పిన్నిగారు, ఈయన నా పెయింటింగ్ బుక్‌లో ఏం రాశారో చూశారా...నా పెయింటింగ్స్ నాలాగే చక్కగా హాయిగా వుంటాయట" అంది గర్వంతో.

"ఊ" అని చరచర వెళ్ళిపోయింది రాధ. రాధ అలా మౌనంగా తిరిగి వెళ్ళిపోవడాన్ని కళ్ళార్పకుండా చూచాడు కృష్ణ. సుబ్బు కళ్ళతో ప్రశ్నించాడు. కృష్ణ కళ్ళల్లోనూ ప్రశ్నే ప్రతిఫలించింది.

ఆ ఒక్కక్షణంలో ఆ గదిలో ఏదో మార్పు వచ్చిందని ఊహించగల్గింది రేఖ. కాని అది ఏమిటో, ఎందుకో తెలుసుకోలేకపోయింది. ఈ మార్పంతా రెండు నిముషాలే.

మళ్ళీ రేఖ, రేఖ అయింది. ఏవేవిటో మాట్లాడింది. చిన్న పిల్లల మాసపత్రిక చదివినందుకు సుబ్బుని ఎగతాళిచేసింది. సుబ్బుకీ తన పెయింటింగ్ బుక్ చూపెట్టింది. అతడి అభిప్రాయాన్ని రాయించి పుచ్చుకుంది...

...రాధ, రేఖావాళ్ళమ్మ దగ్గర సెలవు తీసుకుంది.

"భోంచేసి వెళ్ళండి" అంది రేఖవాళ్ళమ్మ.

"వద్దండీ" అంది రాధ.

"అలాగయితే మా ఇంటో కాఫీ కూడ పుచ్చుకోమండోయ్" అంది రేఖ.

వాళ్ళమ్మవైపు చూస్తూ "వస్తామండీ" అంది రాధ. కృష్ణని కలుసుకుంది.

"వెళ్ళొస్తామండీ వెళ్ళొస్తాం రేఖా...నాన్నగారితో చెప్పు" అన్నాడు సుబ్బు.

ఇల్లుచేరారు కృష్ణా, రాధా. దారిలో రాధ ఏమీ పలుకలేదు. కృష్ణా వూరుకున్నాడు. అసలు విషయం ఏమిటో అంతు చిక్కకపోయినా, అదేదో కాసేపులో బయటపడుతుందనుకున్నాడు.

చీరె మార్చుకుంటూ గదిలోంచి రాధ అంది. "అయినా ఆ అమ్మాయి అలా సిగ్గులేకుండా వుండకూడదు"

ఆ స్వరాన్ని విని కృష్ణ షాక్ తిన్నట్టయాడు. "ఏ అమ్మాయి? రేఖా?"

"ఆ అదే ఇపుడే ఇలా వుంటే, ఇహ రేపు పెరిగి పెద్దయితే ఎలా వుంటుందో?"

"చక్కగా, నిర్భయంగా, నలుగురిలో తిరుగుతూ, ఎవ్వరిమీదా ఆధార పడకుండా ఎవ్వరికీ బానిసకాకుండా వుంటుంది" అన్నాడు కృష్ణ సాధారణంగా.

"వుంటుందుంటుంది! నల్గురిలో ఏమిటి, నలభై మందిలో తిరగ్గలదు."

"ఏమిటి రాధా నీవంటున్నది...?"

"లేకపోతే పెళ్ళికుపిల్ల అలా మీచేతులుపట్టుకు లాక్కెళ్ళడమేమిటి, ఆ నవ్వులేమిటి, ఆ పువ్వులేమిటీ, అవన్నీ మంచిలక్షణాలేనా?"

"రాధా..."

"రేఖ రేఖ అని రోజూ ఇందుకనే కాబోలు మీరు మీ మిత్రుడూ వర్ణించేవాళ్ళు..."

"రాధా! తొందరపడకు. రేఖ పసిపిల్లకీ చెల్లెలు లాటిది."

"అవన్నీ నాకనవసరం. ఇహ నేను వాళ్ళింటికి రాను. ఆ అమ్మాయి ఇక్కడికి రానక్కర్లేదు. మీరు అక్కడికి వెళ్ళడమూ నాకిష్టంలేదు...అంతే" అంది రాధ.

గట్టిగా నిట్టూర్చాడు కృష్ణ. ★



అధైర్యపడవద్దు

శాస్త్రీయమైన, నిజమైన SEX—ADVICE పొందవచ్చును. మీకు ఉందనుకొన్న లక్షణములు వ్రాయుచూ, యింకా వివరాలకు కవరు పంపేది.

డాక్టరు రత్నంసన్స్, (Estd 1904) మలకపేట బిల్డింగ్సు, హైదరాబాద్ - 2. (దక్కను)